ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు 5
శుక్రవారం 26 జులై 2024



తుంగభద్రలోకి వెళ్లకండి : కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), జూలై 25: తుంగభద్ర డ్యాం నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న తరుణంలో నదితీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. డ్యాం నుంచి 28 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారన్నారు. కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాల గ్రామాల ప్రజలు ఏ అవసరమున్నా కూడా నదిలోకి వెళ్లకూడదన్నారు. ముఖ్యంగా పంటలకు నీళ్లు పెట్టేందుకు విద్యుత్ పంపులు ఆన్ చేసేందుకు నది ఒడ్డుకు వెళ్లవద్దని తెలిపారు.

ఉద్ధృతుంగ



డ్యాం గేట్లు దాటి పరుగులు పెడుతున్న తుంగభద్రమ్మ

- తెలుగింటి వైపు తుంగభద్రమ్మ పరుగులు
- టీబీ డ్యాంకు చేరుతున్న 75,810 క్యూసెక్కులు
- 102.576 టీఎంసీలు నిల్వ చేసి..
- 28 గేట్లు ఎత్తి 75,774 క్యూసెక్కులు విడుదల
- ఏ క్షణమైనా 1.50 లక్షల క్యూసెక్కులు రిలీజ్
- నది తీర గ్రామాలకు ప్రమాద హెచ్చరిక జారీ చేసిన టీబీపీ బోర్డు
- వరి నారు సిద్ధం చేసిన ఎల్లెల్సీ రైతులు

కృష్ణమ్మ ఉరుకులు.. తుంగభద్రమ్మ పరుగులు కర్నూలు మెడలో జలహారంగా కనువిందు చేయనున్నాయి. కన్నడనాట పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర హోస్పెట్ డ్యాం జలద్వారాలు దాటి తెలుగింట వైపు పరుగులు పెడుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు నదులు ఉప్పొంగుతున్నాయి. తుంగభద్ర డ్యాం నుంచి 28 గేట్లు ఎత్తి 75,774 క్యూసెక్కులు విడుదల చేశారు. పెరుగుతున్న వరద దృష్ట్యా ఏ క్షణమైనా 1.50 లక్షల క్యూసెక్కుల మేర నీటిని వదిలే అవకాశం ఉందని, తీర గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీబీపీ బోర్డు అధికారులు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మరో వైపు వరినాట్లకు ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు నారు సిద్ధం చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కేసీ కాలువకు అడ్డంగా పైపులు వేసి పూడ్చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు మూడు రోజులలో కర్నూలు నగర ప్రకృతి ప్రేమికులను తుంగభద్ర కనువిందు చేయనుంది.

కర్నూలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశ్చిమ ప్రాంతం కరువు పల్లెసీమ జీవనాడి తుంగభద్ర జలాశయం. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద పోటెత్తుతోంది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. గురువారం 96,538 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు. అయితే 1931.91 అడుగుల వద్ద 102.576 టీఎంసీలు నిల్వ చేసి వచ్చిన వరదను వచ్చినట్లుగానే 28 గేట్లు (20 గేట్లు 2 అడుగులు, 8 గేట్లు అడుగు మేర) ఎత్తి దిగువకు 96,538 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు టీబీపీ బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. తుంగభద్ర డ్యాం ఉపరితలంలో శిమొగ్గ, కొప్పల్, గదగ్ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు డ్యాంకు భారీగా వరద వచ్చి చేరుతోంది. పెరుగుతున్న వరదను దృష్టిలో ఉంచుకుని ఏ క్షణమైనా లక్ష నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉందని టీబీపీ డ్యాం ఇంజనీర్లు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. గతేడాది ఇదే సమయంలో 1606.78 అడుగుల లెవల్‌లో 31.66 టీఎంసీలు నిల్వ ఉంటే.. 72,489 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండేది. ఈ ఏడాది ముందుగానే గరిష్ట నీటి మట్టానికి చేరి గేట్లు ఎత్తడంతో జిల్లా కరువు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్లెల్సీ రైతులు పెంచుతున్న వరినారు



ఎల్లెల్సీ 153 కి.మీల వద్ద యూటీ లీకేజీ

ఎల్లెల్సీ రైతులకు లీకేజీ గండం

తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీ, హెచ్చెల్సీ సహా కర్ణాటకలోని వివిధ కాలువలకు 11,808 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేస్తున్నారు. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి అవసరాల కోసం 510 క్యూసెక్కులు ఇవ్వాలని జిల్లా ఇరిగేషన్ అధికారులు టీబీపీ బోర్డుకు ఇండెంట్ ఇచ్చారు. కర్ణాటక, ఆంధ్ర ఇండెంట్ కలిపి 2 వేల క్యూసెక్కుల వరకు డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు. జిల్లాలో ఏపీ సరిహద్దు ఆదోని మండలం ఆనవాలు దగ్గర 250.855 కిలోమీటర్లు వద్ద 475 క్యూసెక్కుల ప్రవాహం ఉందని ఇంజనీర్లు తెలిపారు. అయితే హాలహర్వి మండలం బాపురం సమీపంలో 153 కిలోమీటరు వద్ద ఎల్లెల్సీ యూటీ లీకేజీ కారణంగా సమీపంలోని వంకలకు వదిలారు. గతేడాదే రూ.33 లక్షలతో సీసీ లైనింగ్, ఆధునికీకరణ పనులు చేశారు. అక్కడే లీకేజీలు రావడం చూస్తే పనుల్లో నాణ్యత ఏపాటితో తెలుస్తోంది. బోరుబావుల వద్ద వరి నారు పెంచుతున్న ఆయకట్టు రైతులు ఎల్లెల్సీ నుంచి మేజర్ డిస్ట్రిబ్యూటరీలు, పంట కాలువల డిస్ట్రిబ్యూటరీల తూములు ఎత్తితే వరి నాట్లు వేసేందుకు ఆయకట్టు రైతులు సిద్ధం అవుతున్నారు. యూటీ లీకేజీతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ప్రమాద హెచ్చరిక జారీ

తుంగభద్ర డ్యాంకు వరద ఉధృతి పెరగడంతో ఏ క్షణమైనా 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉందని టీబీపీ బోర్డు అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాల నదితీర గ్రామాలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. అదే క్రమంగా అప్రమత్తం చేయాలని తీర మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి అతిసమీపంలోనే తుంగభద్ర నది ప్రవహిస్తోంది. వరద హెచ్చరిక జారీ చేయడంతో నదిఒడ్డున ఏర్పాటు చేసుకున్న విద్యుత్ పంపుసెట్లను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆర్డీఎస్ ఆనకట్ట బ్యాక్ వాటర్ వల్లూరు-కడదొడ్డి రహదారి వంతెనపై ఆ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. కోసిగి మండల పరిధిలోని కడదొడ్డి, లక్ష్మీపురం క్యాంపు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వరద పెరుగుతుండడంతో ఏ అవసరం ఉన్నా నదిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కేసీ రైతులకు నేషనల్ హైవే భయం

తుంగభద్ర డ్యాం నుంచి నదికి విడుదల చేసిన వరద కోసిగి మండలం సాతనూరు సమీపంలోని ఆర్డీఎస్ ఆనకట్టకు గురువారం వరద తాకింది. రేపోమాపో సుంకేసుల డ్యాంకు వరద పోటెత్తే అవకాశం ఉండడంతో ముందస్తుగానే రెండు గేట్లు ఎత్తి శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. అయితే డ్యాంకు వరద వచ్చినా కేసీ రైతుల్లో ఆందోళన చెందుతున్నారు. సూరత్-చెన్నై జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కేసీ కాలువపై వంతెన నిర్మాణంలో భాగంగా రాకపోకల కోసం కాలువకు అడ్డంగా పైపులు వేసి పూడ్చేశారు. అదే క్రమంలో వంతెన నిర్మాణం ప్రదేశంలో కాలువ గట్లు తవ్వేశారు. తుంగభద్రకు వరద రాగానే కేసీ కాలువకు 2 వేల క్యూసెక్కులకు పైగా సుంకేసుల బ్యారేజీ నుంచి విడుదల చేస్తారు. అయితే నేషనల్ హైవే ఇంజనీర్లు కాలువను పూడ్చేయడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే పైపులు తీసి కాలువ గట్లును రిపేరి చేయడంతో పాటు లైనింగ్ చేయాలని రైతులు కోరుతున్నారు.



ఆర్డీఎస్ ఆనకట్టకు వరద



ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి దిగువకు వెళ్తున్న వరద

ఆర్డీఎస్ ఆనకట్టకు వరద పోటెత్తుతోంది. గురువారం మధ్యాహ్నం 3:59 గంటలకు ఆర్డీఎస్ ఆనకట్టలోకి వరద నీరు రావడంతో జలకళ సంతరించుకుంది. వరద ప్రవాహంతో రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. - కోసిగి

మాధవరంలో తుంగభద్ర జలకళ



ఆర్డీఎస్ వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు మాధవరంలో సందడి చేశాయి. గురువారం సాయంత్రం టీబీ డ్యాం నుంచి గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో మంత్రాలయంలోని తుంగా తీరానికి వరద వేగంగా చేరుతోంది. శుక్రవారం ఉదయానికి శ్రీమఠం తీరానికి తుంగభద్ర జలాలు చేరుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. దీంతో నదితీర గ్రామాల్లో ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్ర, మాధవరం బ్రిడ్జి వద్ద పరిశీలించి వీఆర్వోలను అప్రమత్తం చేశారు. నదిలో స్నానాలకు వెళ్లే భక్తులకు శ్రీమఠం అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. - మంత్రాలయం

నకిలీ ఎరువులతో దగా

- 200 సంచుల ఎరువులను అంటగట్టిన ఎస్వీఆర్ సొసైటీ సిబ్బంది
- ఎరువులు భూమిలో కలవకపోవడంతో రైతుల ఆందోళన

ఆస్పరి, జూలై 25: ఎరువు భూమిలో కలిసి పోవడం లేదని మండలంలోని పుట్టకలమర్రి గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. ఎస్వీఆర్ సొసైటీ కంపెనీ తయారు చేసిన 200 బస్తాల ఎరువులను సిబ్బంది మండలంలోని పుటకలమర్రి గ్రామంలో రైతులకు బస్తా రూ.1400 ప్రకారం విక్రయించి వెళ్లారు. ఈ ఎరువులను పొలాల్లో చల్లితే.. నాలుగు రోజులైనా మట్టిలో కలిసిపోవడం లేదని చంద్రారెడ్డి, రామంజిని, మల్లికార్జున రెడ్డి, నాగేష్, పరశురాముడు తదితర రైతులు తెలిపారు. తమకు నకిలీ ఎరువులను అంగట్టారని వారు ఆరోపించారు. తమకు ఎరువులు విక్రయించిన సిబ్బందికి ఫోన్ చేస్తే వాళ్లు స్పందించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మోసాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



ఎస్వీఆర్ కంపెనీ ఎరువులు

జగన్ కుట్రలతోనే..

- పూర్తికాని పోలవరం ● పార్లమెంట్‌లో ఎంపీ బస్తిపాటి



కర్నూలు(రూరల్), జూలై 25: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుట్రతోనే పోలవరం ప్రాజెక్టు పూర్తి కాలేకపోయిందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో జీరో అవర్‌లో తొలిసారిగా సభలో ఎంపీ మాట్లాడారు. తొలుత ఎంపీగా తనకు అవకాశం కల్పించి పార్లమెంటులో నిల్చుని మాట్లాడేందుకు కారణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గుర్తించి రూ.15వేల కోట్లను బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు అభినందనలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రతో పాటు ప్రకాశం జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించడం శుభపరిణామన్నారు. విద్యుత్, రైల్వే, జాతీయ రహదారులకు నిధులు ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. బడ్జెట్‌పై విపక్షపార్టీ నేతలు ఆంధ్ర, బీహార్ బడ్జెట్ అని విమర్శించడం మంచిది కాదన్నారు. గత ఐదేళ్ల జగన్ విధ్వంస పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. కనీసం రాజధాని కూడా లేని రాష్ట్రంగా పాలన సాగిందన్న విషయాన్ని అందరూ గుర్తించుకోవాలని ఎంపీ పేర్కొన్నారు. కర్నూలు జిల్లాల్లో ప్రభుత్వ ఆసుపత్రిని ఎయిమ్స్ తరహాలో తీర్చిదిద్ది వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను నిర్మించాలని పార్లమెంటులో స్పీకర్‌ను కోరారు. వలసలను నివారించి ప్రత్యేక చర్యలు తీసుకొని వాటితో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు పరిశ్రమలు నెలకొల్పి కర్నూలు జిల్లా అభివృద్ధికి సహకరించాలని ఎంపీ నాగరాజు లోక్‌సభలో కోరారు.

జిల్లా అభివృద్ధికి కృషి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు(కలెక్టరేట్), జూలై 25: రాష్ట్రంలో అభివృద్ధి పథంలో కర్నూలు జిల్లాను మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తానని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని పారిశుద్ధ్య పనులు, సీజనల్ వ్యాధులపై ప్రత్యేకంగా చర్యలు చేపట్టామన్నారు. అన్ని పాఠశాల్లో వంటల నిర్వహణకు గ్యాస్ కనెక్షన్లు కూడా ఇచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. కేజీబీవీలలో సీట్ల కోసం విపరీతంగా పోటీ నెలకొందన్నారు. ఈ మేరకు కొత్త కేజీబీవీను నెలకొల్పేందుకు ప్రతిపాదనలు పంపుతున్నామని వెల్లడించారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో నైట్ ల్యాండింగ్‌తోపాటు రన్‌వే అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. దీంతో పెద్ద ఎత్తున నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎల్లెల్సీ ద్వారా రాబోయే ఖరీఫ్ సీజన్‌లోని పంటలకు 35 వేల ఎకరాలకు సాగునీటి విడుదల చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

ఎమ్మిగనూరు కేజీబీవీలో విచారణ

- విద్యార్థినులకు నాసిరకం భోజనం
- అధికారుల్లో సమన్వయ లోపం
- విచారణ అధికారుల వెల్లడి



ఎమ్మిగనూరు పట్టణంలోని కస్తుర్బా గాంధీ విద్యాలయంలో వంట మనుషులను విచారిస్తున్న ఏడీ శామ్యుల్ పాల్

ఎమ్మిగనూరు, జూలై 25: ఎమ్మిగనూరు పట్టణంలోని కేజీబీవీ కస్తుర్బా గాంధీ విద్యాలయంలో డీఈఓ కార్యాలయం ఏడీ శామ్యుల్‌పాల్, ఎస్ఎస్ఏ జీసీడీఓ స్నేహలత, డిప్యూటీ డీఈఓ వెంకటరామి రెడ్డి గురువారం విచారణ నిర్వహించారు. కొన్ని రోజులుగా విద్యాలయంలో చదివే విద్యార్థినులకు సరైన సమయానికి భోజనం, టిఫిన్ అందటం లేదని, అది కూడా నాణ్యతగా లేకపోవడంపై ఇటీవలి కాలంలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో డీఈఓ కార్యాలయం, ఎస్ఎస్ఏ అధికారులు విద్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. ముందుగా వంటమనుషులను, సిబ్బందిని విచారించారు. వారిమధ్య సమన్వయం లేదని అధికారులు గుర్తించారు.

● **కన్నీటి పర్యంతమైన విద్యార్థిని :** విచారణకు వచ్చిన అధికారుల ఎదుట ఓ విద్యార్థిని కన్నీటి పర్యంతమైంది. ఆ విద్యార్థినితో పాటు మిగతా విద్యార్థినులు సైతం భోజనం ఏమాత్రం బాగోలేదని, తినలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ విద్యార్థిని భోజనం తింటే ఆయాసం వస్తోందని అధికారులకు తెలిపింది. టిఫిన్ ఉదయం 11 గంటకు పెట్టారని, ఒక రోజు భోజనం రాత్రి పొద్దుపోయిన తరువాత పెట్టగా రెండు రోజుల క్రితం మధ్యాహ్నం 3 గంటలకు పెట్టారని చెప్పారు. టిఫిన్, భోజనం ఆలస్యంగా ఇవ్వడం వల్ల తరగతులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఏడీ శామ్యుల్ పాల్, జీసీడీఓ స్నేహలత మాట్లాడుతూ కేజీబీవీలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, సరిపడా భోజనం కూడా ఇవ్వడం లేదన్నారు. ఇది చాలా బాధాకరమైన విషయమన్నారు. ప్రిన్సిపాల్, వంటమనుషులు, సిబ్బందితో పాటు విద్యార్థినులతో సుదీర్ఘంగా విచారించామన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేసి చర్యలు తీసుకుంటామన్నారు.



విద్యార్థినులతో వివరాలను సేకరిస్తున్న విచారణ అధికారులు

విద్యార్థి సంఘాల ఆందోళన

కేజీబీవీలో విచారణకు వచ్చిన అధికారులకు విద్యార్థి సంఘాల నాయకులు విజేంద్ర, రాజేష్, మహేంద్ర బాబు, ఉదయ్ కుమార్, వీరేష్ యాదవ్, అఫ్రిది, శేఖర్, రఘులు విద్యాలయంలో జరగుతున్న అక్రమాలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ కవిత పదేళ్లుగా ఇక్కడే ఉంటోందని, దీంతో విద్యార్థినులకు సరైన భోజనం అందడం లేదని ఆరోపించారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు అధికారుల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.



ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కిరాణ షాపులో దొంగతనం

ఎమ్మిగనూరు టౌన్, జూలై 25 : ఎమ్మిగనూరు పట్టణంలోని కమిటీ రోడ్డు సమీపంలో ఉన్న వెంకటేశ్వర ఆయిల్, కిరాణ మర్చంట్‌లో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. కంబలదిన్నె గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప కమిటీ రోడ్డులో షాపు నిర్వహిస్తున్నాడు. నిన్న రాత్రి యథావిధిగా షాపునకు తాళం వేసి వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి చూసే సరికి షాపు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. సీసీ కెమెరాకు ఉన్న కనెక్షన్ వైరులను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. షాపులోని బస్తా కంది పప్పు, రూ.50వేల సిగరెట్ల డబ్బా, ఆయిల్ డబ్బా, రూ. 65 వేల నగదు మొత్తం రూ.1.50 వేల దొంగతనం జరిగింది. షాపు యజమాని బోయ తిమ్మప్ప జరిగిన సంఘటన గురించి పోలీసులకు తెలపగా ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరి మృతి



వీరన్న (ఫైల్)



హరిక్రిష్ణ (ఫైల్)

నందికొట్కూరు రూరల్ జూలై 25 : బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారి 340 సీ కేజీపై ఆర్టీసీ బస్సు, ఆటోను ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు పోలీసుస్టేషన్ పరిధిలో కేజీ రహదారిపై కర్నూలు నుంచి వస్తున్న ఏపీ 21టీ జెడ్ 1294 నెంబరు గల ఆటోను నందికొట్కూరు నుంచి కర్నూలు వెళుతున్న నాన్ స్టాప్ ఆర్టీసీ అల్ట్రా పల్లె వెలుగు బస్సు ఏపీ 21 జెడ్ 0840 నెంబరు గల బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శాతనకోట గ్రామానికి చెందిన టీ వీరన్న (28) హరిక్రిష్ణ (26) అనే మిత్రులు అక్కడికక్కడే మృతి చెందారు. వీరన్న ఆటో నడుపుతుండగా అతనితో కలిసి ప్రయాణిస్తున్న హరికృష్ణ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. వీరన్నకు ఏడు నెలల క్రితం ప్రాతకోటకు చెందిన హైమావతితో వివాహం జరిగింది. ఆయన భార్య మూడు నెలల గర్భిణి. ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం హైమావతిని ప్రాతకోట వెళ్లే బస్సు ఎక్కించి పంపించారు. అనంతరం వీరన్న తన పెళ్లి ఫొటో ఆల్బమ్ తీసుకొని మిత్రుడు హరికృష్ణతో కలిసి స్వగ్రామానికి తిరుగు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలానికి ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, బ్రాహ్మణకొట్కూరు ఎస్సై నాగార్జున చేరుకుని మృతదేహాలను నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరన్న తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

31న స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 25: బి. తాండ్రపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ మైనార్టీ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చక్రవర్తి గురువారం తెలిపారు. ఆటో మొబైల్, మెకానికల్, ఇంజనీరింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని ఈ నెల 31న ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించి ఫీజు రూ.5,800 చెల్లించాలన్నారు. వివరాలకు 8919638961, 8897544821 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎస్‌బీపీఆర్ కళాశాలలో...

ఎస్‌బీపీఆర్ ప్రభుత్వ బాలికల కళాశాలలో బయో మెడికల్ ఇంజనీరింగ్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో భర్తీ కానీ సీట్ల కోసం ఈ నెల 31న ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. వివరాలకు పాలిటెక్నిక్ కార్యాలయంలో సంప్రదించి ఈ నెల 29న సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.6వేలు చెల్లించి అడ్మిషన్ పొందాలని వివరించారు. వివరాలకు 99898 99095 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వినియోగదారుల కమిషన్ ద్వారా ఇద్దరికి న్యాయం

కర్నూలు(లీగల్), జూలై 25: కొనుగోలు చేసిన పరికరాలు సరిగా పని చేయకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించిన ఇద్దరికి సత్వర న్యాయం అందించినట్లు జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్ తెలిపారు. స్థానిక సోమిశెట్టి నగర్‌కు చెందిన బి. నరేష్ ఈ ఏడాది ఫిబ్రవరి 28న రూ.36 వేలు చెల్లించి బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో హెయిర్ కంపెనీకి చెందిన ఒక వాషింగ్ మిషన్‌ను కొనుగోలు చేశాడు. అయితే కొన్ని వారాలకే అది సరిగ్గా పని చేయకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. ఫిర్యాదికి కొత్త వాషింగ్ మిషన్ ఇచ్చేందుకు హెయిర్ కంపెనీ అంగీకరించింది. మరొక కేసులో స్థానిక నంద్యాల చెక్‌పోస్టుకు చెందిన మాజీ ఎయిర్‌ఫోర్స్ అధికారి వెంకటయ్య గత మార్చి నెలలో ఎల్‌జీ కంపెనీకి చెందిన వాటర్ ఫిల్టర్‌ను కొనుగోలు చేశారు. అది సరిగ్గా పని చేయకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. కమిషన్ నుంచి నోటీసు అందుకున్న ఎల్‌జీ కంపెనీ సిబ్బంది పని చేయని పరికరాన్ని మార్చేందుకు అంగీకరించారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లుగా నకిలీ విలేకరుల ముఠా

ఆదోని, జూలై 25: ఫుడ్‌సేఫ్టీ అధికారులమంటూ నలుగురు నకిలీ విలేఖర్లు హోటల్ వ్యాపారుల్ని బెదిరించి డబ్బులు వసూలు చేశారు. రెండు రోజుల క్రితం ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై ఆదోని మార్కెట్ యార్డ్‌లోని ఉన్న రెడ్డి హోటల్‌కు వెళ్లారు. తాము ఫుడ్‌సేఫ్టీ అధికారులమని హోటల్ యజమానిని పరిచయం చేసుకున్నారు. హోటల్‌ను తనిఖీ చేయాలని కిచెన్‌లోకి వెళ్లారు. అంతా పరిశీలించాక ఈగలు అధికంగా ఉన్నాయని, ఇలా ఉంటే రోగాలు వస్తాయని, ఇలా ఉంటే హోటల్‌ను మూసేస్తామని హెచ్చరించారు. అందులో ఉన్న మరో వ్యక్తి లంచానికి బేరం పెట్టాడు. యజమాని వీరారెడ్డి వెంటనే రూ.వెయ్యి ఇస్తానని అన్నాడు. దానికి వారు రూ.30వేలు ఇవ్వాని అన్నారు. చివరికి రూ.2వేలు తీసుకొని చిత్తగించారు. వాళ్లు వెళ్లిపోయాక హోటల్ యజమాని విచారిస్తే వాళ్లు సోషల్ మీడియాలో పనిచేస్తున్న నకిలీ విలేఖరులని తేలింది. వీరు పట్టణంలో చాలా హోటల్లోనూ, బార్ అండ్ రెస్టారెంట్లలోనూ ఇదే విధంగా బ్లాక్‌మెయిల్ చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. బైపాస్ రోడ్డులో ఇటీవల లారీలను నిలిపి పోలీసులమంటూ లారీలోని రికార్డులను తనిఖీ చేసి రూ.40వేలు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక చోట కొంత మంది నకిలీ విలేకరులు అధికారుల పేర్లు చెప్పుకొని వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

గర్భిణికి చుక్కలు చూపిన వైద్యులు

- ఓపీ చింపి బయటకు పంపారంటున్న బంధువులు
- కలెక్టర్ జోక్యంతో అడ్మిషన్
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వైనం



బాలింతను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ

కర్నూలు(హాస్పిటల్), జూలై 25: నిండు గర్భిణికి కర్నూలు జీజీహెచ్ గైనిక్ వైద్యులు చుక్కలు చూపించారు. నందవరం మండలం గురజాలకు చెందిన శశికళకు పురిటి నొప్పులు రావడంతో బుధవారం ఎమ్మిగనూరు నుంచి అంబులెన్సులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. ఉదయం 11 గంటలకు కాన్పు కోసం ఓపీ తీసుకొని రాగా అక్కడి వైద్యులు ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉన్నా అడ్మిట్ చేసుకోలేదు. గైనిక్ వార్డులోని వైద్యులు గర్భిణి ఓపీని చింపి బయటకు పంపారు. దీనిపై బంధువులు ప్రశ్నించగా.. ఎవరికైనా చెప్పుకోండి, కలెక్టర్‌కైనా, పెద్ద డాక్టర్‌కైనా.. అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో గర్భిణి బంధువులు, భర్త సాయంత్రం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సిఫారసుతో సాయంత్రం 5.30 గంటలకు కాన్పుల వార్డులో వైద్యులు అడ్మిట్ చేసుకున్నారు. ఈ విషయాన్ని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి నాయకులు సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. గురువారం అడ్మిషన్ అయిన శశికళ సాయంత్రం మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం బాలింతను రాత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని, ఏఆర్ఎంవో డా. వెంకటరమణ పరామర్శించారు.

తల్లీ బిడ్డ క్షేమం - డా.సి. ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ విభాగంలో గురజాల గ్రామానికి చెందిన శశికళ మొదటి కాన్పుకు బుధవారం వచ్చింది. గర్భిణికి ఉమ్మ నీరు తక్కువగా ఉండటం వల్ల గురువారం సాయంత్రం సిజేరియన్ చేశారు. మగబిడ్డ పుట్టింది. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు.

ఒలింపిక్స్‌లో దేశానికి వన్నె తేవాలి

- మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్
- పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ క్రీడాకారులకు మద్దతుగా ర్యాలీ



కొండారెడ్డి బురుజు దగ్గర ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ టీజీ, డా.శంకర్‌శర్మ, క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 25: పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటి భారతావనికి వన్నె తేవాలని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. భారత క్రీడాకారులకు మద్దతుగా గురువారం ఉదయం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో టీజీ వెంకటేశ్‌తో పాటు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మ, రెండో ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లవరం రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ దేశ క్రీడారంగానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. డా.శంకర్‌శర్మ మాట్లాడుతూ రాష్ట్ర క్రీడాకారులు పతకాలతో సత్తా చాటాలన్నారు. స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎస్‌టీబీ సర్కిల్, చిన్న పార్కు, కోట్ల సర్కిల్, కోల్స్ కళాశాల మీదుగా కొండారెడ్డి బురుజు వరకు సాగింది. ఈ ర్యాలీలో క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షవర్ధన్, నాగరత్నమయ్య, వంశీ, నవీన్, గుడిపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి అభివృద్ధికి సహకరిస్తాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూలై 25: రాయలసీమ జిల్లాల ఆరోగ్య సంజీవిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. గురువారం ఆయన సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డిని కలిసి ఆసుపత్రి అభివృద్ధికి కావాల్సిన నిధుల గురించి చర్చించారు. స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు కావాల్సిన వైద్య పరికరాల గురించి ముఖ్యమంత్రి, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో చర్చిస్తామని తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఆగస్టు 5వ తేదీ జిల్లా రివ్యూ మీటింగ్ ఉంటుందని, అందులో జిల్లాకు చెందిన ప్రభుత్వ ఆసుపత్రులు, ఆదోని, కర్నూలు మెడికల్ కాలేజీల అభివృద్ధి గురించి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌తో కలిసి ముఖ్యమంత్రి, మంత్రులు నారా లోకేశ్, సత్య కుమార్‌తో కలిసి చర్చిస్తామన్నారు. క్యాన్సర్ హాస్పిటల్‌కు కావాల్సిన నిధుల గురించి, ఆదోని మెడికల్ కాలేజీ, కర్నూలు జీజీహెచ్‌లో జరుగుతున్న పనుల పురోగతి గురించి చర్చిస్తామన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్‌రెడ్డిని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డా.కేజీ గోవిందరెడ్డి, టీడీపీ స్టేట్ సెక్రటరీ నాగేంద్ర, హెచ్‌డీఎస్ మాజీ సభ్యులు పోతురాజు రవికుమార్, రవి పాల్గొన్నారు.

డీజీపీని కలిసి ఎమ్మెల్యేలు



డీజీపీకి పూ లమొక్క అందజేస్తున్న ఎమ్మెల్యేలు

కల్లూరు, జూలై 25: రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గురువారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, గిత్తా జయసూర్య, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ నాయకుడు యశ్వంత్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈమేరకు పాణ్యం, నందికొట్కూరు, నియోజకవర్గాలతో పాటు నంద్యాల జిల్లా పరిధిలో శాంతిభద్రతలకు సంబంధించిన పలు అంశాలను డీజీపీ దృష్టికి వారు తీసుకెళ్లారు.

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 25: విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ సూచించారు. గురువారం దేవనగర్‌లోని గుడ్‌షపర్డ్ పాఠశాలలో కర్నూలు డివిజన్ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్ల ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అన్ని యజమాన్య పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హైస్కూల్‌లో 5 ప్రాజెక్టులను, ప్రాథమికోన్నత పాఠశాలలో 3 ప్రాజెక్టులలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కార దిశగా ప్రాజెక్టు నమూనాలు ఉండాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి అత్యధిక నామినేషన్లు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.మిన్నెల్ల, జిల్లా సైన్స్ ఆఫీసర్ రంగమ్మ, రిసోర్స్‌పర్సన్లు దాసు, ఉస్మాన్, కోఆర్డినేటర్స్ రాజశేఖర్, మరియానందం, సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ ఏజెంట్ మోసం..

కువైట్‌లో కర్నూలు వాసి ఆవేదన

కర్నూలు, జూలై 25: నకిలీ ఏజెంట్ ద్వారా కువైట్‌కు వెళ్లి మోసపోయిన ఓ కర్నూలు వాసి తిరిగి భారతదేశానికి రావడానికి ఇబ్బందులు పడటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్నూలు చెందిన అల్తాఫ్ అనే వ్యక్తి ఈ ఘటనలో బాధితుడు. అల్తాఫ్ కూలి పని కోసం కువైట్ వెళ్లేందుకు ఈ ఏడాది జనవరి 10వ తేదీన కర్నూలు చెందిన లాల్‌బాషా, మహబూబ్ బాషా అనే ఇద్దరు ఏజెంట్లను ఆశ్రయించాడు. సుమారు వారికి రూ.60వేలకు పైగా ఫీజు చెల్లించి, వారి ద్వారా కువైట్ వెళ్లాడు. అయితే అక్కడ పని నచ్చకపోవడంతో తిరిగి భారత్‌దేశానికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు. అయితే భారత్ నుంచి పంపిన ఏజెంట్లే తిరిగి రప్పించాలి. అయితే కువైట్ ఎంబసీలో లాల్‌బాషా, మహబూబ్‌బాషాలతో రిజిస్ట్రేషన్ అయిన ఏజెంట్లు ఎవరూ లేకపోవడంతో బాధితుడు తిరిగి కర్నూలు రావడానికి ఇబ్బంది పడ్డాడు. ఆ ఇద్దరూ నకిలీ ఏజెంట్లు అని కువైట్ అధికారులు తెలిపారు. బాధితుడు కొందరి సాయంతో ఇండియన్ ఎంబసీ అధికారులను సంప్రదించి రూ.35వేలు చెల్లించి ఎలాగో కర్నూలు చేరుకున్నాడు. తాను మోస పోయానని గుర్తించి లాల్‌బాషా, మహబూబ్‌బాషాలపై వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కుమార్ తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 25: నగర పాలక సంస్థ స్థాయి సంఘం కమిటీ సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. గురువారం అడిషనల్ కమిషనర్ చాంబర్‌లో నామినేషన్ దాఖలు చేసిన కార్పొరేటర్ల సమక్షంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు పరిశీలన చేపట్టారు. నామినేషన్ పత్రాలన్నీ సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు. అలాగే ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జునైద్, ఉద్యోగులు జీఎం.శ్రీకాంత్, రామక్రిష్ణ పాల్గొన్నారు. 28న విత్‌డ్రా ఉన్నట్లు మేనేజర్ తెలిపారు.

● **జనసేన వైపు ఇద్దరు కార్పొరేటర్లు:** వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు జనసేన వైపు చూస్తున్నారు. ప్రస్తుతం స్టాండింగ్ కమిటీలో సభ్యుల కోసం నామినేషన్ దాఖలు చేశారు. ఇద్దరిలో ఒక్కరికి వచ్చిన వైసీపీలోని కొనసాగుతామని, లేనిపక్షంలో జనసేనలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. అంతేకాకుండా నామినేషన్ పత్రాల పరిశీలన సమయంలో కూడా ఆ ఇద్దరు రాలేదు. పరిశీలన పూర్తయిన అనంతరం వచ్చి సంతకాలు చేశారు. అదేవిధంగా కర్నూలు నియోజకవర్గం వైసీపీ నుంచి ఇద్దరు ముస్లిం మైనార్టీలకు ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

బేతంచెర్ల, జూలై 25: పట్టణంలోని బోయపేటలో నివసిస్తున్న బోయ హుశేన్ భార్య నాగలక్ష్మమ్మ (60) అనారోగ్యంతో మనస్తాపానికి గురై బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన గురువారం జరిగింది. ఇంటి నుంచి వెళ్లి బనగానపల్లె రహదారిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జటాధర శివాలయం పక్కన ఉన్న బావిలో దూకి నాగలక్ష్మమ్మ ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వజ్రాల వేటకు వచ్చి మృత్యువాత

పాముకాటుకు గురైన అనంతపురం మహిళ

మహానంది, జూలై 25: వజ్రాల వేటకు పుల్లా లక్ష్మీదేవి(58) అనే మహిళ పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మహానంది మండలం ఆంజనేయపురంలో జరిగింది. పది రోజుల క్రితం మండలంలోని సర్వనరసింహ స్వామి ఆలయం సమీపంలో ప్రవహించే వాగులో వజ్రల వేటకై అనంతపురానికి చెందిన పుల్లా లక్ష్మీదేవితోపాటు మరి కొందరు వచ్చారు. బుధవారం ఆంజనేయపురంలో విడిది చేసే ప్రాంతానికి లక్ష్మీదేవి చేరుకుంది. తన వెంట తెచ్చుకున్న బ్యాగులో నుంచి బట్టలు తీసుకునేందుకు తెరిచే సరికి అప్పటికే బ్యాగులో ఉన్న పాము కాటు వేసింది. మిగతా వాళ్లు ఆమెను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక ఆమె మృతి చెందింది. గురువారం మృతురాలి కుమారుడు ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ఆటో డ్రైవర్లు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఎస్పీ జి. బిందు మాధవ్



ఆటో టాప్ నెంబర్ల కార్డులు అందజేస్తున్న ఎస్పీ

కర్నూలు, జూలై 25: ఆటో డ్రైవర్లు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఆటో డ్రైవర్లకు ఆటో టాప్ నెంబర్ల ఐడీ కార్డులను అందజేశారు. అనంతరం ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఆటోలు బళ్లారి చౌరస్తా, ప్రభుత్వ ఆసుపత్రి, నగరంలోని పాఠశాలలు వంటి ముఖ్యమైన కూడళ్లలో ఇతర వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగే విధంగా ఆటోలు నడపవద్దని సూచించారు. అలాగే క్రమశిక్షణతో వ్యవహరించాలని అన్నారు. రికార్డులు లేని, ర్యాష్ డ్రైవింగ్ చేసే ఆటోల వివరాలను తెలిపి పోలీసులకు సహకరించాలని కోరారు.

ఓడీఎఫ్ సర్వేను పూర్తి చేయండి: డీపీవో



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో నాగరాజు నాయుడు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 25: ప్రతి గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత (ఓడీఎఫ్)గ్రామంగా తీర్చిదిద్దేందుకు గానూ నిర్వహి స్తున్న ఓడీఎఫ్ సర్వేను వారం రోజుల్లోపు పూర్తి చేయాలని డీపీవో నాగరాజు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం మద్దికెర గ్రామ పంచాయితీలో తాగునీరు, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. సర్వేలో ఆస్పరి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడుబూరు మండలాల సర్వేలో పూర్తిగా వెనుకపడ్డాయని అన్నారు. ఆయన వెంట పంచా యతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 25: నగరంలోని కోచింగ్ సెంటర్ల యజ మాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కోచింగ్ సెంటర్లలో వసతులు లేకపోయినప్పటికీ నిరుద్యోగుల నుంచి వేలాది రూపాయలు వసూ లు చేస్తున్నారని ఆరోపించారు. దీర్ఘకాలం తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వ డంతో నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందేందుకు వెళ్తున్నారని, దీన్ని ఆసరాగా చేసుకుని వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపిం చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు చంటి, సురేంద్ర యాదవ్, కాశీం, రాజశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపు అభినందనీయం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 25: పార్లమెంటు సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు అభినందనీయమని బీజేపీ మహి ళా మోర్చా కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గొందిపల్లె మాలతి అన్నారు. గురువా రం ఎస్.నాగప్ప వీధిలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అంధకా రంలో పడిందన్నారు. పెరిగిన పన్నులతో ప్రజల అభివృద్ధికి ఆటంకం కలిగిందని అన్నారు. టీడీపీ కూటమితో రాష్ట్రాభివృద్ధితోపాటు మహిళలకు పెద్దపీట వేస్తూ 33 శాతం రిజర్వేషన్, డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల నుం చి 20 లక్షల వరకు రుణాలు పెంపుదల చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత, జిల్లా కార్యదర్శి ఊర్మిళ, కోశాధికారి శారద, లక్ష్మి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో మైనార్టీలపై వివక్షత

కర్నూలు(న్యూసిటీ), జూలై 25: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీలపై వివక్షత చూపారని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎ.సుభాన్ అన్నారు. గురువారం కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ అనుసరించే మైనార్టీ వ్యతిరేక విధానాలు తాజా బడ్జెట్ ప్రత్యక్షంగా కనపడుతుందన్నారు. విదేశీ చదువుల కోసం విద్యారుణాలపై వడ్డీ రాయితీని 21 కోట్ల నుంచి 15.3 కోట్లకు తగ్గించిం దన్నారు. ఇలా ప్రతి అంశంలోనూ బీజేపీ ప్రభుత్వం మైనార్టీలపై వివక్షత చూ పుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



రంగస్వామి(ఫైల్)

ఓర్వకల్లు, జూలై 25: ఉప్పలపాడు మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు రంగస్వామి(70) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ఆసుపత్రికి తరలిం చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రంగ స్వామి 2006లో ఉప్పలపాడు సర్పంచుగా పని చేసి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ఈయన టీడీపీ బలోపేతానికి కృషి చేశారు. విషయం తెలిసిన వెంటనే పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఫోన్ ద్వారా ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. మృతు డికి భార్య రామాంజనమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ అయ్యస్వామి, నాగేశ్వరరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు భౌతికకా యానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రంగస్వామి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే గౌరు దంపతులు ఫోన్‌లో తెలిపారు.

కేసులు ఎత్తివేత ప్రకటనపై హర్షం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 25: సీపీఎస్ రద్దు ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తేస్తామని గురువారం అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షణీయమని పీఆర్‌టీయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు డా.వి.కరుణానిధిమూర్తి తెలిపారు. దాదాపు 4వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయుల మీద పెట్టిన వివిధ సెక్షన్ల కేసులు ఎత్తేయాలని కోరారు.

పారిశుధ్య సమస్యలపై చర్యలు తీసుకోవాలి

కల్లూరు, జూలై 25: గ్రామ పంచాయతీల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన ఉలిందకొండ, ఎర్రకత్వ గ్రామాల్లో పర్యటించి తాగునీరు, పారిశుధ్యం పనులను పరిశీలించారు. డ్రైనేజీలను శుభ్రం చేయాలని, ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి క్లోరినేషన్ అనంతరం ప్రజలకు నీరు సరఫరా చేయాలని అదేశించారు.

సైబర్, ఆన్‌లైన్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, జూలై 25: సైబర్, ఆన్‌లైన్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు ఎస్ఐ హనుమంతయ్య సూచిం చారు. గురువారం గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ హనుమంతయ్య విలేకరులతో మాట్లాడుతూ సైబర్ ఆన్‌లైన్ నేరాల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని తల్లికి వందనం తదితర ప్రభుత్వ పథకాలు డబ్బులు మీ ఖాతాల్లో వేస్తామని ఆశ చూపుతున్నారని అన్నారు. అలాంటి ఫోన్ కాల్స్, మెసేజ్‌లు నమ్మవద్దని సూచించారు.

మట్కా బీటర్ అరెస్టు

కర్నూలు, జూలై 25: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముజఫర్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న రాంగోపాల్ రెడ్డిని పోలీ సులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.11వేల నగదు, మట్కా చీటీలు, 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

రౌడీషీటర్‌పై కేసు నమోదు: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ ఇమ్రాన్‌ఖాన్‌పై పోలీసులు మరోసారి నమోదు చేశారు షరీన్‌నగర్‌కు చెందిన సురేష్ అనే వ్యక్తి తమపై పోలీసులకు సమాచారం ఇస్తు న్నాడని భావించి ఇమ్రాన్‌ఖాన్ అతని అనుచరులు సురేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పశువులకు వైద్య పరీక్షలు చేయించాలి

కల్లూరు, జూలై 25: గర్భకోశ వ్యాధులున్న పశువులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించాలని బహూలార్థ పశువైద్యశాల ఉపసంచా లకుడు డాక్టర్ హేమంత్‌కుమార్, సహాయ సంచాలకుడు డాక్టర్ ధనుంజయ రైతులకు సూచించారు. గురువారం కల్లూరు మండలం చిన్నటేకూరులో పశువులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎదకురాని, గర్భకోశ వ్యాధులున్న పశువులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ పార్థసారధి, పశువైద్యులు శ్రీకాంత్ సౌజన్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు యాక్షన్ ప్లాన్

కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి. రంజిత్‌బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూలై 25: కర్నూలు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ జి.బిందు మాధవ్‌తో కలిసి కలెక్టర్ రహదారి భద్రతా సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై 51 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, ఆ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలుగా గుర్తించిన 52 ప్రాంతాల్లో కూడా ప్రమాదాలు నివారించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వద్ద అండర్‌పాస్ లేదా అప్రోచ్ రోడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐ-40 అధికారులను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గేందుకు వీలుగా రాజ్‌విహార్ సమీపంలో ఉన్న పాత డిపో నుంచి నందికొట్కూరు, నంద్యా ల బస్సులు తిరిగే అంశాన్ని కూడా పరిశీలించాలని ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశిం చారు. నగరంలో పనిచేయని సీసీ కెమెరాల స్థానంలో కొత్త సీసీ కెమెరాలు ఏర్పా టు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఎస్పీ బిందు మాధవ్ మా ట్లాడుతూ నగరంలో చాలా చోట్ల సీసీ కెమెరాల్లో విజువల్స్ సరిగ్గా కనపడడం లేద ని, దొంగతనాలను కనిపెట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని తెలిపారు. సమావేశంలో అదనపు మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి ప్రణాళికను రూపొందించండి: జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఎలక్ట్రిషియన్, వైర్‌మెన్, మోటారు మెకానిక్ విభాగాలతో పాటు టైలరింగ్, ప్లం బర్, కార్పెంటర్ తదితర అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికా రులను ఆదేశించారు. నైపుణ్య శిక్షణకు సంబంధించిన యాప్‌ను డెవలప్ చేసి కంపెనీలు, వ్యాపార సంస్థలతో అనుసంధానం చేసి యువ తకు ఉద్యోగావకా శాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా, మెప్మా పీడీ నాగ శివలీల, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి పాల్గొన్నారు.

ప్రసూతి మరణాలు లేకుండా చూడాలి: ప్రసూతి మరణాలు సంభవించ కుండా నిర్ణీత సమయంలో వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రసూతి మరణాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత మూడేళ్లలో గర్భిణులు హైబీపీతో మర ణించిన కేసులను ఇతర జిల్లాలతో పోల్చుతూ నివేదిక సమర్పించాలని వైద్యాధి కారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి సెక్యూరిటీ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

జీజీహెచ్‌లో సీఐటీయూ నిరసన



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, సెక్యూరిటీ గార్డులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 25: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏళ్ల తరబడి పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పరిపాలన విభాగం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఓల్డ్ సిటీ కార్యదర్శి మారెళ్ల విజయ రామాంజనేయులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పని చేస్తున్న బాల తిమ్మయ్య రెండు రోజులు అనుమతి తీసుకుని సెలవులో వెళ్లినందుకు విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. లైంగిక వేధింపులకు గురైన మహిళా కార్మికురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు ఇచ్చిందనే కారణంగా ఆరోపణలున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్లు ఫిరోజ్‌ఖాన్, రవితేజలను తొలగించకుండా బాధితురాలిని విధుల నుంచి తొలగించడం దుర్మార్గమ న్నారు తక్షణమే హాస్పిటల్ అధికారులు ఏజెన్సీ ఎండీతో మాట్లాడి తొలగించిన సెక్యూరిటీ గార్డులను విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు మహ్మద్, నాయకులు రాంబాబు, కుమార్, కిట్టు, అంజి, విశ్వనాథ్, మద్దిలేటి, చంద్రబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

కోడుమూరు, జూలై 25: కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలని కేజీబీఎస్ రాష్ట్ర నాయకుడు ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక సంతమార్కెట్‌లోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చనిపోయిన వాళ్లను శ్మశానంలో గుంతలు తీసి పూ డుస్తూ, కట్టెలు పేర్చి కాలుస్తూ అనారోగ్యానికి గురవుతున్న కాటికాపరులను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. సీఐటీయూ నాయకులు గఫూర్‌మియా మాట్లాడుతూ కరోనా సమయంలో మృతి చెందిన వాళ్ల శవాలను పూడ్చిన ఘనత కాటికాపరులదన్నారు కార్యక్ర మంలో సీఐటీయూ నాయకులు ఈశ్వరయ్య, నాగేశ్వరరావు, దేవన్న, మద్దిలేటి, మౌలాలి పాల్గొన్నారు.

కదిరె కృష్ణపై చర్యలు తీసుకోవాలి : వీహెచ్‌పీ



కర్నూలు డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు(కల్చరల్), జూలై 25: హిందూ దేవుళ్లు, తిరుపతి వెంక టేశ్వర స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కరిదే కృష్ణపై కఠిన చర్యలు తీసుకొని, అరెస్టు చేయాలని వీహెచ్‌పీ నాయకులు కోరారు. గురువారం వీహెచ్‌పీ జిల్లా న్యాయ సలహాదారు ఉమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు కర్నూలు డీఎస్పీ విజయశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర మతానికి సంబంధించిన కదిరే కృష్ణ అనే వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో తిరుమతి వెంకటేశ్వర స్వా మిని దూషిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పెడుతు న్నాడని, అతనితోపాటు అతని వెనుక ఉన్న వ్యక్తులను కూడా బయట కు తీసుకువచ్చి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు వేముల గోపిశెట్టి, శివకోటి చంద్ర శేఖర్, ఉపేంద్ర నాయక్, చామిరాజు శివ తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య రంగంలో విప్లవాత్మక మార్పులు

ఐవీఎఫ్ డే సందర్భంగా వైద్యుల ర్యాలీ



గాంధీ విగ్రహం వద్ద బెలూన్లు ఎగురవేస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 25: సాంకేతిక పరిజ్ఞానంలో పురోగతి వల్ల సంతాన సాఫల్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని విష్ణుప్రియ టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్ ఫెర్టిలిటీ స్పెషలిస్టు డా.పి. విష్ణుప్రియ పేర్కొన్నారు. వరల్డ్ ఐవీఎఫ్ డేను పురస్కరించుకుని గురువారం ఉదయం నగరంలో ఫెర్టిలిటీ స్పెషలిస్టు వైద్యులు కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద ఐవీఎఫ్ డే సందర్భంగా బెలూన్లను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు గైనిక్ సొసైటీ అధ్యక్షుడు డా. వెంకటరమణ, సీనియర్ గైనకాలజిస్టులు డా. బీటీ సీత, డా. అన్నపూర్ణ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మోడలింగ్‌పై అశోక కళాశాలలో వర్క్‌షాపు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 25: స్థానిక దూపాడులోని అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్ సిలికో నానో మెటీరియల్ మోడలింగ్‌పై గురువారం ఇంటర్నేషనల్ వర్క్‌షాపు ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ఈ నెల 29 వరకు వర్చువల్‌గా కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ నిపుణులు పాల్గొంటున్నారు. హ్యూమనిటీస్ అండ్ సైన్స్ డిపార్టుమెంట్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా పంజాబ్ సెంట్రల్ యూనివర్సిటీ డా. జగదీష్ కుమార్, ప్రొ. నసీర్ సిద్రీ ఈ వర్చ్యువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నగర పాలక కమిషనర్‌గా ఐఏఎస్?

కర్నూలు(న్యూసిటీ), జూలై 25: నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఓ మహిళా ఐఏఎస్ వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక్కడ పని చేస్తున్న ఎ.భార్గవతేజ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా వెళ్లారు. అయితే గతంతో ఇక్కడే పని చేసిన పీవీవీఎస్.మూర్తి, రవీంద్రబాబు కూడా కమిషనర్‌గా వస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో రవీంద్రబాబు ఇప్పటికే రెండు పర్యాయాలు కమిషనర్‌గా సేవలు అందించారు. అదేవిధంగా పీవీవీఎస్.మూర్తి కూడా ఒక్కసారి కమిషనర్‌గా పని చేశారు. ఈ క్రమంలో కమిషనర్‌గా ఐఏఎస్‌లను నియమించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే గతంలో ప్రశాంతి కమిషనర్‌గా పని చేశారు. తరువాత గ్రూప్-1 అధికారి హరినాథరెడ్డి 2016 నుంచి 2018 వరకు పని చేశారు. ఈ నేపథ్యంలో ఐఏఎస్ అధికారి డీకే.బాలాజీని 2020లో కమిషనర్‌గా నియమించారు. 2022లో ఎ.భార్గవతేజ కమిషనర్‌గా వచ్చారు. నాలుగు సంవత్సరాలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్‌లు విధులు నిర్వహించారు. దీంతో ప్రస్తుతం కూడా ఐఏఎస్‌ను మాత్రమే కమిషనర్‌గా నియమిస్తారని కొందరు చెప్పుకుంటున్నారు.

తుంగభద్ర నదిలోకి వెళ్లొద్దు

కర్నూలు(రూరల్), జూలై 25: కర్నూలు రూరల్ మండలంలోని తుంగభద్ర నదిలోకి ఎవరూ వెళ్లవద్దని తహసీల్దార్ రామాంజుల నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజుల నుంచి ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురియడంతో సుంకేసుల జలాశయంలోకి భారీగా నీరు చేరిందన్నారు. తద్వారా ఆశాఖ అధికా రులు సుంకేసుల డ్యాంకు సంబంధించిన రెండు గేట్లు నీటిని దిగువ ఉన్న తుంగభద్ర నదికి వదిలారని వివరించారు. నదీతీర గ్రామాల ప్రజలు, ఇసుక కోసం వెళ్లే వారు, పశువుల కాపరులు, మత్స్యకారులు నదిలోకి వెళ్లరాదన్నారు.


సి.బెళగల్: నదీతీరా గ్రామాలైన తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, శింగవరం, కొత్తకోట గ్రామాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని తహసీల్దార్ అనుపమ తెలిపారు. తుంగభద్రపైన డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో దిగు వ ప్రాంతానికి లక్షన్నరకు పైగా నీరు దిగువ ప్రాంతానికి నీరు వస్తుందని ఆమె తెలిపారు. ఆయా గ్రామాలలో దండోరా వేయించారు.

రెండు దుకాణాల్లో అగ్నిప్రమాదం

కర్నూలు, జూలై 25: నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న కేంద్రీయ విద్యాలయం ఎదుట అగ్ని ప్రమాదం జరిగింది. ఓ బుక్ షాపుతోపాటు ఫర్నీచర్ సామగ్రి ఈ అగ్నిప్ర మాదంలో దగ్ధమైంది. మొదట ఫర్నీచర్ దుకాణంలో షాట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. మంటలు బుక్ షాపులోకి వ్యాపించడంతో రెండు దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఓర్వకల్లు, జూలై 25: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డ్వామా పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ అమర్నాథ్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని శకునాల గ్రామంలో పారి శుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బం దితో సమావేశం నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య పనులను తప్పనిసరిగా చేయాలని, తాగునీటి ట్యాంకులు శుభ్రంగా ఉండేలా కృషి చేయాలని అన్నారు. దోమల నివారణకు ప్రతి వీధిలో మందులు పిచికారి చేయించాలని, గ్రామంలో ఎక్కడైనా పైపులైన్లలో లీకేజీలు ఉంటే గుర్తించి వాటికి మరమ్మతులు చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సాయి కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శకునాలలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి

సీఎం చంద్రబాబును కలిసిన మల్లెల రాజశేఖర్



చంద్రబాబుతో మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జూలై 25: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబును నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజ శేఖర్ గురువారం సెక్రటేరియ ట్‌లో కలిసారు. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గంలోని సమస్యలను సీఎంకు ఆయన వివరించారు. అలాగే కేంద్ర బడ్జె ట్‌లో ఓర్వకల్లు, బెంగళూరు, పారిశ్రామిక కారిడార్ అభి వృద్ధికి కృషి చేసిన చంద్రబా బుకు మల్లెల రాజశేఖర్ కృత జ్ఞతలు తెలిపారు. గత టీడీపీ హయాంలో ఓర్వకల్లు మండ లాన్ని ఇండస్ట్రీయల్ హబ్‌గా తీర్చిదిద్దారని, ఈ నేపథ్యంలో ఓర్వకల్లును కారిడార్ అభివృద్ధితో మండలం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. చంద్రబాబు హయాంలో విమానాశ్రయం, ఉక్కు, ఆయుధాల పరిశ్రమలు, సోలార్ పార్కును నిర్మించారన్నారు. అలాగే గుట్టపాడు సమీపాన నూతనంగా నిర్మిస్తున్న జయరాజ్ ఇస్పాత్ (ఉక్కు పరిశ్రమ) సీఎం చంద్రబాబు హయాంలో భూమి పూజ చేశారని, వంద రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగానే ప్రారంభి స్తారని తెలిపారు. నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

కర్నూలు(న్యూసిటీ), జూలై 25: కర్నూలులో ఆగస్టు 1, 2 తేదీలలో జరిగే కులవివక్ష పోరాట సమితి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం కేకే భవన్‌లో జరిగిన కల్లూరు మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులు, దౌర్జనాలు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ మదనగోపాల్, ఎన్. చక్రపాణి, రత్నం, బీదన్న, రాముడు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 25: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్‌కు వారు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి రైతులంతా సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టేలా ప్రోత్సహించే ఉద్యోగులకు దాదాపు సంవత్సర కాలంగా ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదని అన్నారు. ఈ మేరకు వినతి పత్రంలో డీపీఎం అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం నాయకులు జేపీ స్వామి, సురేంద్ర, రామచంద్ర, రమేష్, రామాంజనేయులు ఉన్నారు.

కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌కు సన్మానం



బాలునాయక్‌ను సన్మానిస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 25: కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బాలునాయక్‌ను టీఎస్ఎఫ్ నాయకులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక చట్టాలను ప్రజలకు తెలిసేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. కార్మికుల శ్రేయస్సుకు అధిక నిధులు కేటాయింపునకు కృషి చేయాలన్నారు. రామరాజు, కార్యదర్శి వెంకటేశ్, కృష్ణ, శివ, దేవేంద్ర నాయక్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ



కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న మాధురి

కల్లూరు, జూలై 25: భూ యజమానుల నుంచి ఇబ్బందులు తలె త్తకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తున్నట్లు జిల్లా రిసోర్స్ సెంటర్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం వ్యవసాయ అధికారి మాధురి తెలిపారు. గురువారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అర్హులైన కౌలు రైతులకు ఉలిందకొండ టీడీపీ సీనియర్ నాయకుడు ఈవీ రమణ ఆధ్వర్యంలో ఆమె గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీన్, వీఆర్వో రామాంజనేయులు, వీఏఏ సంధ్య, టీడీపీ నాయకులు బి. సుబ్బరాయుడు, ప్రభాకరరెడ్డి, బి.శేఖర్, భాస్కర్‌రెడ్డి, చిన్నమద్దయ్య, విక్రమ్, ఈవీ. శ్రీకాంత్, సి. వెంకట రమణ పాల్గొన్నారు.

వేరుశనగ పంటల పరిశీలన

సి.బెళగల్, జూలై 25: రైతులు పంట పొలాలలో నీరు నిలువకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ రైతులకు తెలిపారు. గురువారం మండలంలోని కొత్తకోట, ఈర్లదిన్నె, శింవరం గ్రామాల్లోని పత్తి, ఉల్లి, వేరుశెనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతుల పొలాల గెట్ల చుట్టు వర్షం నీరు ఇంకి పోయేలా గంతలు తీయాలన్నారు. ఏవో వెంట రైతులు, ఎంపీవోలు సిద్ధు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఘనంగా జయతీర్థులవారి ఆరాధన

సి.బెళగల్, జూలై 25: మండలంలోని కొత్తకోట గ్రామంలో తుంగభద్రనది పక్కన వెలసిన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో జయతీ ర్థులవారి ఆరాధనోత్సవం గురువారం వేదపండితుడు లక్ష్మణదాసు అధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మఠంలో వేదపండితులు 30 మందితో ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



చెత్తదిబ్బను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సి.బెళగల్, జూలై 25: మండలంలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో శంకుతల అన్నారు. గురువారం మండలంలోని గుండ్రేవుల, ఇనగండ్ల గ్రామాల్లోని పరిస రాలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మట్లాడుతూ ఇనగండ్ల గ్రామంలో చెత్త దిబ్బలను తొలగించని పంచాయతీ కార్యదర్శిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆయా గ్రామాలలో ఏఎన్ఎంలు ఆశవర్కర్లు, సచివాలయ సిబ్బంది విధులకు రావడం లేదని గ్రామస్థులు ఎంపీడీవోకు తెలిపారు. ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఉన్నారు.

బాధ్యతగా పని చేయాలి: డీపీవో



మాట్లాడుతున్న డీపీవో నాగరాజు నాయుడు

మద్దికెర, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిన పనులను బాధ్యతగా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే చెత్తబుట్టలు సరఫరా చేస్తామని, వాటిని వెంటనే ప్రజలకు అందించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి చెత్త సంపద కేంద్రాలకు పంపించాలన్నారు. సర్వేను వేగవంతం చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో పారిశుధ్య వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 15 రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, ముస్టూరు రామాంజులు, ఏవో స్వర్ణలత, కార్యదర్శులు సుధాకర్, హరికృష్ణ, పరమేశ్వరప్ప తదితరులు ఉన్నారు.

రెగ్యులర్ కార్యదర్శిని నియమించండి :

మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్ గౌడు, పంచాయతీ సభ్యులు ఉషా జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడును కోరారు. అలగే రామ్‌నగర్, సాయినగర్ కాలనీలో వర్షాలు వచ్చిన సమయంలో ఇబ్బందులు పడుతున్నారని నీరు, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలన్నారు.

ఆక్రమణల తొలగింపులో కక్ష సాధింపు



అధికారులతో వాదిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని టౌన్, జూలై 25: మున్సిపల్ అధికారులు నిర్వహిస్తున్న ఆక్రమణల తొలగింపులో కక్ష సాధింపు కనపడుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి రమేష్ యాదవ్ అన్నారు. తాను ఊళ్లో లేని సమయంలో తన ఇంటి ముందు ఉన్న ర్యాంపును కావాలనే తొలగించి అదే ప్రాంతంలో ఉన్న ఇతర ర్యాంపులను వదిలేయడం ఏమిటని ప్రశ్నించారు. గురువారం మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ నాయక్‌లతో కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఉద్దేశపూర్వకంగా చేసినట్లు భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ ధోకా, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, శ్రీనిత్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



మంత్రి లోకేశ్‌తో కృష్ణమనాయుడు

హాలహర్వి, జూలై 25: ఆలూరు ప్రాంతంలో విద్యాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరినట్లు టీడీపీ జిల్లా ప్రతినిధి కృష్ణమనాయుడు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ హాలహర్విలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, పార్టీ కోసం పని చేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరామన్నారు. మారుమూల పల్లెలకు ఉపాధ్యాయులను నియమించాలని, ఆలూరు విద్య కోసం ప్రత్యేక దృష్టి సారించాలని వినతి పత్రం అందజేశామని తెలిపారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 25: ఉద్యోగ ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వీ రమేష్ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌టీయూ ప్రాంతీయ కార్యాలయంలో పట్టణ ఆర్థిక కార్యదర్శి జంబులయ్య అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వేతన సవరణ కమిటీకి వెంటనే చైర్మన్‌ను నియమించాలని కోరారు. జీవో 117ను రద్దు చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వీరచంద్ర యాదవ్; పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, భీమరాజు, వీరేష్, గంగానాయక్, వెంకటరామిరెడ్డి, శ్రీరాములు జయరాముడు, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

నీటి పథకానికి రూ.2.50 లక్షల విరాళం

మద్దికెర, జూలై 25: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో సురక్షిత నీటి పథకానికి రూ.2.50 లక్షల విరాళాన్ని గ్రామానికి చెందిన వెంకటప్ప కుమారులు విజయకుమార్, డా. ఎల్వీ రమణారెడ్డి గురువారం సర్పంచ్ పద్మావతికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఫ్లోరైడ్ నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడకూడదనే ఉద్దేశంతో సురక్షిత నీటి పథకానికి విరాళం ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో మోహన్, రంగస్వామి, చెన్నకేశవులు, శ్రీనివాసులు ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కోసిగి, జూలై 25: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని డీఎల్‌పీవో నూర్జహాన్ అన్నారు. గురువారం కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 9వ వార్డు గాంధీనగర్‌లో ఉన్న డ్రైనేజీ కాలువలను, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ఇళ్ల చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పరిశుభ్రత పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తిరుమలేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, మాణిక్యరాజు, రాజేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను విస్మరిస్తే చర్యలు

మంత్రాలయం, జూలై 25: గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు తాగునీటి సమస్య పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్ర అన్నారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామంలో పర్యటించారు. తాగునీరు, డ్రైనేజీల నిర్వహణ, పారిశుధ్య, ప్రజారోగ్య పరిస్థితి వంటి అంశాలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్లపైనే చెత్త, దిబ్బలు వేసి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, తక్షణమే వాటిని తొలగించాలని అన్నారు. ఈ పరిశీలనో ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్ కుమార్, వీఆర్‌ఏ నరసింహులు, శ్రీరాములు, అంజలి, ఈడిగ హనుమంతు పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై ఊరేగిన జయతీర్థులు

● బంగారు రథానికి పూజలు చేసిన పీఠాధిపతి



స్వర్ణరథంపై ఊరేగుతున్న జయతీర్థులు, (ఇన్‌సెట్‌లో) పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 25: వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య రాఘవేంద్ర స్వామి గురువులైన జయతీర్థులు బంగారు రథంపై ఊరేగారు. గురువారం ఉదయం నుంచి జయతీర్థుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. జయతీర్థుల బృందావన చిత్రపటాన్ని బంగారు రథంపై అధిష్ఠించి హారతులు ఇచ్చి రథాన్ని ముందుకు సాగించారు. జయహో జయతీర్థుల మహాప్రభో.. అంటూ నినాదాలు చేస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. జయతీర్థుల మూల బృందావనం, నవ బృందావనాల్లో ఉండటంతో అక్కడి మఠం అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవం అనంతరం ఊంజల సేవ నిర్వహించి జయతీర్థులనుద్దేశించి పండితులు ప్రవచనాలు చేశారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మాట్లాడుతూ మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురువులైన జయతీర్థుల ఆరాధనోత్సవాలు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు అనుగొంది మఠంలో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, వాదిరాజాచార్, రమణారావు, రాజా ఎస్ అప్రమేయాచార్, ద్వార పాలక అనంత స్వామి, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి చెన్నైకు చెందిన పవిత్ర కన్నన్ అనే భక్తురాలు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానానికి రూ.లక్ష విరాళం ఇచ్చారని అన్నారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

మెనూ పాటించకపోతే చర్యలు



బాలికను కస్తూర్బా పాఠశాలలో చేర్పిస్తున్న శ్యాముల్‌పాల్

గోనెగండ్ల, జూలై 25: కస్తూర్బా పాఠశాలలో నిర్వాహకులు మెనూ ప్రకారం భోజనం చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ డైరెక్టర్ శ్యామూల్‌పాల్ అన్నారు. గురువారం గోనెగండ్లలోని కస్తూర్బా పాఠశాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యాబోధన ఎలా సాగుతోంది.. మంచి భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు బాగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఇప్పటి నుంచే విద్యార్థులు కష్ట పడి చదవాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. అనంతరం చిన్నమరివీడు గ్రామానికి చెందిన బోయ సింధు అనే బాలికను కలెక్టర్ స్పెషల్ పర్మిషన్ కింద కస్తూర్బా పాఠశాలలో చేర్పించారు. సింధు వారంలో మూడు రోజులు బడికి నాలుగు రోజుల కూలీ పనికి పోతున్నట్లు సమాచారం తెలుసుకొని ఆ బాలికను కస్తూర్బాలో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు రామాంజినేయులు, నీలకంఠ, కస్తూర్బా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గోనెగండ్ల, జూలై 25: ప్రభుత్వం విద్యారంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. విద్యారంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు గురువారం గోనెగండ్లలోని ఏపీడీవో సోనుబాయి, తహసీల్దార్ పార్వతి, ఎంఈవో రామాంజినేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేస్తూ తీసుకువచ్చిన జీవో నెం 117 రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మద్దిలేటి, చంద్రపాల్, రాముడు, వెంటరమణ, అక్బర్, నాగేశ్వరరావు, బాబు, లక్ష్మణ్, సుంకన్న, పాల్గొన్నారు.

గిరిజన వైద్యశాలగా మార్చాలి



స్పీకర్‌ను కలిసిన ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి

తుగ్గలి, జూలై 25: తుగ్గలి మండలంలోని పగిడిరాయి వైద్యశాలను గిరిజన వైద్యశాలగా మార్చి మెరుగైన వైద్య సేవలు అందించాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి అన్నారు. గురువారం అసెంబ్లీ ఆవరణలో ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడును కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రం అందించామని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కువ గిరిజన గ్రామాలు ఉన్న మండలం తుగ్గలి అని, ఇక్కడ గిరిజనులకు ప్రత్యేకంగా ఎలాంటి వైద్యశాలలు ఏర్పాటు చేయలేదని అన్నారు. గిరిజన వైద్యశాలను ఏర్పాటు చేసి సేవలు అందించాలని, అలాగే గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు.

అవహేళన చేసిన వ్యక్తిని శిక్షించాలి

పత్తికొండ టౌన్, జూలై 25: వెంకటేశ్వరస్వామి వారి సుప్రభాతాన్ని కించపరిచిన కదిరి కృష్ణపై చర్యలు తీసుకోవాలని బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్ నాయుడు, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు వీర్రాజు డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మురళీమోహన్‌కు కృష్ణపై చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అలాగే రెవెన్యూ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రామలింగయ్య, మన్‌కీబాత్ కో కన్వీనర్ కరణం నరేష్, బీజేపీ నాయకులు మల్లికార్జున, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలతో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న స్త్రీనిధి జిల్లా అసిస్టెంట్ మేనేజర్ సాగర్

మద్దికెర, జూలై 25: మండలంలోని పొదుప సంఘాల్లో ఉన్న మహిళలు స్త్రీనిధి రుణాలతో వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందాలని స్త్రీనిధి జిల్లా అసిస్టెంట్ మేనేజర్ సాగర్, ఏపీఎం మధుబాబు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో స్త్రీనిధి ద్వారా చాలా మంది మహిళలు వ్యక్తిగత రుణాలు తీసుకుని వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారన్నారు. సురక్షిత నీటి ప్లాంట్లు, గోకుల షెడ్లు వేసుకున్నారని తెలిపారు. దాదాపు మండలంలో రూ.5 కోట్ల వరకు స్త్రీనిధి రుణాలు ఇచ్చామని చెప్పారు. రుణాలు తీసుకున్న మహిళలు సకాలంలో చెల్లించాలని కోరారు. వీబీకేలు ఎవరైనా బినామీ పేర్లతో రుణాలు పొందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో వెలుగు సీసీలు కళావతి, ఈశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

బీసీల అభివృద్ధికి కృషి చేయాలి



బీసీ సంక్షేమ శాఖ మంత్రికి వినతి పత్రం ఇస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు

తుగ్గలి, జూలై 25: రాష్ట్రంలో బీసీలు వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధి కోసం కృషి చేయాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. గురువారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని, ఇక్కడ బీసీ సంక్షేమ హాస్టళ్లు, జ్యోతిరావు పూలే హాస్టళ్లు ఏర్పాటు చేయాలని, అలాగే జూనియర్ కళాశాల కూడా ఏర్పాటు చేయాలన్నారు. బీసీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మంత్రాలయం, జూలై 25: మంత్రాలయం వద్ద తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు మంత్రాలయం ఎస్‌ఐ గోపీనాథ్ తెలిపారు. గురువారం చిలకలడోన గ్రామానికి చెందిన బోయ రామాంజిని అనే వ్యక్తి తుంగభద్ర నదిలో ఇసుకను లోడ్ చేసుకుని వెళ్తుండగా.. దాడి చేసి పట్టుకున్నామన్నారు. పంచనామా నిర్వహించి తహసీల్దార్‌కు ట్రాక్టర్‌ను సీజ్ చేసి అప్పగించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా తుంగభద్ర నది నుంచి ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

కౌతాళం, జూలై 25: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర రోజులు కావస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులు నాగేంద్రప్ప, జగదీష్‌లు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సంఘం సభ్యులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైతులు, ప్రజల సమస్యలను మండల అధికారులు విఫలమయ్యారని అన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్ముతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, వెంకప్ప, ఉలిగప్పలు పాల్గొన్నారు.

కౌలు కార్డులు వరం

మంత్రాలయం, జూలై 25: కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకో వడం వరంలాంటిదని మండల వ్యవసాయాధికారి జీర గణేష్ అన్నారు. గురువారం మండలంలోని మాలపల్లిలో సచివాలయం వద్ద కౌలు రైతులతో వీఆర్వో రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటను విక్రయించేందుకు విత్తనాలు, ఎరువులు పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. కౌలు రైతులు కౌలు కార్డులు పొంది ప్రభుత్వం ఇచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఈవో రాజేశ్వరి, ఈరన్న పాల్గొన్నారు.

పలు రకాల పంటలతో లాభాలు

వెల్దుర్తి, జూలై, 23: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పలు రకాల పంటలు సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందవచ్చని సబ్ డివిజన్ యాంకర్ మాబువలి అన్నారు. గురువారం రామళ్లకోట గ్రామంలో రైతు మాసుమ్‌వలి కంది పొలంలో బీజామృతంతో విత్తన శుద్ధి చేసి వేయించారు. పలు రకాల పంటలు సాగు చేస్తే ఒక పంటలో నష్టం వచ్చినా మిగతా పంటల్లో లాభాలు పొందవచ్చని అన్నారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏడీవో మోహన్ విజయ్ కుమార్, మధుమతి, ఏవో అక్బర్‌బాషా, వీఏఏ సాంబశివుడు, ఐసీఆర్‌పీ రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

రావి ఆకుపై కార్గిల్ అమరుల చిత్రాలు



కార్గిల్ యుద్ధంలో అమరులైన వారి చిత్రాలను రావి ఆకుపై వేసిన విద్యార్థిని

ఆదోని (అగ్రికల్చర్), జూలై 25: కార్గిల్ విజయ్ దివాస్‌ను పురస్కరించుకొని మండలంలోని అలసంద గుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థిని తలారి నికిత రావి ఆకుపై దేశ సైనికుల కళా ఖండాలను వేసి అబ్బురపరిచింది. జనవరి 26 కార్గిల్ విజయ్ దివాస్ పురస్కరించుకొని కార్గిల్ ఉద్యమంలో ప్రాణాలర్పించిన దేశ సైనికులను స్మరించుకునేందుకు రావి ఆకుపై జాతీయ జెండాతోపాటు అమరులైన సైనికుల చిత్రాలను డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఎన్‌కేర ప్రత్యేక శిక్షణలో ఈ చిత్రాన్ని వేసినట్లు విద్యార్థిని నిఖిత తెలిపింది. ప్రధానోపాధ్యాయురాలు గిరిజాదేవి, ఉపాధ్యాయులు అద్భుతమైన కళాఖండాలను వేసిన విద్యార్థినిని అభినందించారు.

ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి



ఏపీఐఐసీ, ఎండీని కలిసిన ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, జూలై 25: పది వేలపై చిలుకు మోటార్ మెకానిక్‌లు ఉన్న ఆదోని పట్టణంలో ఆటో నగర్ ఏర్పాటు చేయాలని గురువారం మంగళగిరిలో ఏపీఐఐసీఎండీ అభిషిత్ కిషోర్‌ను ఆదోని ఎమ్మెల్యే డా. పార్థ సారథి కలిసి కోరారు. ఈ వృత్తి పైనే ఆధారపడిన వేలాది కుటుంబాలకు ఆటోనగర్ ఏర్పాటుతో ఉపాధి లభిస్తుందని వివరించారు. వేలాది మంది వాహన మెకానిక్‌లు ఆటోనగర్ ఏర్పాటు కోసం గతంలోనే ఏపీఐఐసీకు తమ వాటాగా రూ.33 లక్షలు చెల్లించారని తెలిపారు. వెంటనే ఆటోనగర్ ఏర్పాటు కోసం స్థల సేకరణ చేసి కార్మికులకు అందజేయాలని కోరడంతో ఎండీ అంగీకరించారని పార్థసారథి వెల్లడించారు.

రద్దు చేసిన రైళ్లను తిరిగి ప్రారంభించాలి

ఆదోని టౌన్, జూలై 25: ఆదోని పట్టణం మీదుగా వెళ్లే వారాంతపు ప్రత్యేక రైళ్లను కరోనా సమయంలో రద్దు చేశారని, వాటిని తిరిగి ప్రారంభించాలని సామాజిక కార్యకర్త నసీరుద్దీన్ పటేల్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాకినాడ నుంచి ఆదోని పట్టణం మీదుగా రాయచూరు వరకు, విజయవాడ నుంచి ఆదోని పట్టణం మీదుగా రాయచూరు వరకు రెండు వారాంతపు ప్రత్యేక రైళ్లు ఉండేవని అన్నారు. వీటిని రద్దు చేయడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. తిరిగా ప్రారంభించాలని సీఎంకు లేఖ రాసినట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయ భవనాల పరిశీలన



తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

ఆలూరు, జూలై 25: ఆలూరు తహసీల్దార్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఆర్డీవో రామలక్ష్మి, జడ్పీ సీఈవో నాసరెడ్డి గురువారం పరిశీలించారు. ఆలూరు పట్టణంలోని శ్రీశక్తి భవన్, ఎంపీడీవో కార్యాలయ పాతభవనం, ప్రారంభం కాకుండా ఉన్న రెండు సచివాలయాలను తహసీల్దార్ కార్యాలయ ఏర్పాటు కోసం పరిశీలించారు. త్వరలోనే తహసీల్దార్ కార్యాలయాన్ని మార్పు చేస్తామని ఆర్డీవో తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో నరేంద్ర కుమార్ తహసీల్దార్ చంద్రశేఖర్ ఉన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 25: ఎమ్మిగనూరు పట్టణంలో గురువారం ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. నాగురు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి (28) తండ్రి నాగిరెడ్డి కలుగొట్ల రోడ్డు సమీపంలో ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. విష్ణువర్ధన్‌రెడ్డి ఉదయం షాపునకు వెళ్తుండగా గుండె పోటుకు గురయ్యాడు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

బస్సు సౌకర్యం కల్పించండి

హొళగుంద, జూలై 25: హొళగుంద మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామానికి విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి ఆదోని డిపో మేనేజర్ మహమ్మద్ రఫీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దహ్యాట నుంచి హొళగుందలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే 8 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సుమారు 40 మందికి పైగా విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఎంతో మంది చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించలాని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సతీష్ కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మల్లి పాల్గొన్నారు.

లోకేశ్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

మంత్రాలయం, జూలై 25: పాఠశాలల్లో మాతృ భాషలో కూడా విద్యాబోధన కొనసాగిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామన్న, గోట్ల చంద్రశేఖర్‌లు అన్నారు. గురువారం చౌలహల్లి, మంత్రాలయం, రచ్చుమర్రి గ్రామాల్లో పర్యటించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత 20 ఏళ్లుగా అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్ పదోన్నతులు కల్పించి ఇంటర్మీడియట్ విద్యా ప్రమాణాలను పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శివ శంకర్, పీటీ నవాజ్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

దేవనకొండ, జూలై 25: ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కరివేముల - తెర్నేకల్ రోడ్డుపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తెర్నేకల్ గ్రామానికి చెందిన కల్లు శ్రీరాములు (42) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆటోలో వ్యవసాయ పంటల ఉత్పత్తులను తరలిస్తుండేవాడు. బుధవారం రాత్రి కరివేముల నుంచి తెర్నేకల్ వెళ్లే సమయంలో ఆటో బోల్తా పడి మృతి చెందాడు. మృతుని భార్య రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీరాములుకు భార్య, ఒక కూతురు ఉన్నారు.

సాగు నీరందించేందుకు కృషి

కోసిగి, జూలై 25: మండలంలోని ఎల్లెల్సీ పరిధిలో ఉన్న ఆయకట్టు రైతులందరికీ సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామని సాగు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, కర్నూలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి అన్నారు. గురువారం కోసిగి సమీపంలోని ఎల్లెల్సీలో పేరుకుపోయిన పూడికతీత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నాడిగేని చిన్న తాయన్న, కొండగేని నర్సన్న పాల్గొన్నారు.

ముగిసిన వాహనాల వేలం పాటలు

ఆలూరు, జూలై 25: ఆలూరు సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం సెబ్ స్టేషన్‌లో జిల్లా సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం ద్వారా రూ.1,79,950 ఆదాయం చేకూరిందని తెలిపారు. పట్టుబడిన రూ.12,50,000 విలువ చేసే కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేశారు.